

నేటి నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్
నేటి నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ జరుగుతాయని ఆర్‌ఐఓ తెలిపారు. - 8లో..



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం
నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహద పడతాయని ఎస్పీ దామోదర్ తెలిపారు. - 8లో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 31/23
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ టీచర్లకు శాశ్విత కౌన్సెలింగ్ నిర్వహించాలి

● టీచర్స్ గిల్డ్ డిమాండ్



దీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయులకు శాశ్విత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట రావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు డీఈఓ కార్యాలయం వద్ద ఎయిడెడ్ ఉపాధ్యాయులకు శాశ్విత కౌన్సెలింగ్ నిర్వహించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ జీరో ఎన్‌రోల్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోకి సర్దుబాటు చేయాలన్నారు. కంభం సత్యనారాయణ శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఓ.సూర్యనారాయణ పెండింగ్ జీతాల సమస్య పరిష్కరించాలన్నారు. కొమరోలు మండలం గోపాలపల్లి ఏబీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయుడు డి.ఆంజనేయులు జీతాల సమస్య, చెరుకూరు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల 13 నెలల జీతాల సమస్య, వివేకానంద ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ సమస్య పరిష్కరించాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సంస్కృత, తెలుగు, హిందీ, పీఈటీలకు పదోన్నతి కల్పించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు.

రైతులు సాగుచేసిన కొర్రపంట



వర్షాభావ పరిస్థితులు రబీ సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. అరకొర వర్షాలతో రైతులు పంటలు సాగుచేయలేకపోయారు. రబీ సీజన్ ముగింపునకు వచ్చినా ఇంకా 73 శాతం మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. వరితో పాటు చిరుధాన్యాల సాగూ చిన్నబోయింది. సాగుచేసిన పంటలకూ తెగుళ్ల బెడదతో రైతులు సతమతమవుతున్నారు. మినుములు, మిర్చి, మొక్కజొన్న పంటల్లో తెగుళ్లతో దిగుబడులు తగ్గి నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

సాగు అరకొర

● రబీలో పంటల సాగు 73 శాతమే.. ● తగ్గిన వరి, చిరుధాన్యాల సాగు
● తెగుళ్లతో దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు ● నష్టాలు తప్పవంటున్న రైతులు

రబీ సాధారణ సాగు విస్తీర్ణం: 1,61,020 హెక్టార్లు
సాగైంది: 1,16,915.886 హెక్టార్లు

మార్కాపురం: జిల్లా వ్యాప్తంగా రబీలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. సాగైన పంటలు కూడా తెగుళ్లు సోకడంతో దిగుబడులపై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో 1,61,020 హెక్టార్లకు గానూ 1,16,915.886 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటేసాగు కావాల్సిన విస్తీర్ణంలో 73 శాతం మాత్రమే సాగయ్యాయి. జిల్లాలో అక్టోబరు 15న రబీ సీజన్ ప్రారంభమైంది. ఫిబ్రవరి 15 వరకూ రబీ సీజన్ ఉన్నప్పటికీ పంటల సాగుమాత్రం ఆగిపోయింది. అనుకున్నదానికంటే ఈ ఏడాది వరి విస్తీర్ణం పడిపోవడంతో రాబోయే రోజుల్లో బియ్యం కోసం ఇతర ప్రాంతాలపై ప్రజలు ఆధారపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో మొత్తం రబీ సీజన్‌లో వరి 21,669 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 13,156.82 హెక్టార్లలో సాగైంది. దీంతో జిల్లాలో బియ్యం, గ్రాసం కొరత ఏర్పడనుంది. ప్రధానంగా సాగర్ కాలువల కింద మాత్రమే రైతులు మిర్చి సాగుచేశారు. పశ్చిమ ప్రకాశంతో పాటు జిల్లాలోని కనిగిరి, కొండపి తదితర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో వరిసాగు తగ్గింది. ఎకరా వరిసాగుకు సుమారు రూ.35 నుంచి రూ.40 వేల ఖర్చు రావడం, ఎకరాకు 22 నుంచి 25 బస్తాలు (75 కిలోలు) మాత్రమే దిగుబడులు రావడం, మార్కెట్‌లో ధాన్యం క్వింటా రూ.1300 మాత్రమే ఉండటంతో ఈ ఏడాది వరిసాగుపై రైతులు ఆసక్తి చూపలేదు.



బూడిద తెగులు సోకిన మినుము పంట



వైరస్ తెగులు సోకిన మిర్చి పాలం

మినుము పంట దెబ్బతీసింది



ఈ ఏడాది మినుము పంట బాగా దెబ్బతీసింది. మినుముకు బూడిద తెగులు రావడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు సుమారు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని అనుకున్నాం. అయితే 80 కిలోలు కూడా రావడం కష్టమైంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. అకాల వర్షాలతోనే తెగుళ్ల వచ్చాయి.

– శివ, రైతు సీతానాగులవరం

పైర్లకు తెగుళ్లు...

మిర్చి, మినుము, మొక్కజొన్న తదితర పైర్లకు తెగుళ్లు సోకడంతో దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. పప్పుశనగ, కంది పైర్లపై మాత్రమే రైతులు ఆశలు పెట్టుకున్నారు. మినుముకు బూడిద తెగులు, కుచ్చుతెగులు, మొక్కజొన్నకు కత్తెర తెగులు, మిర్చికి ఎర్రనల్లి, వైరస్ తెగుళ్లు వ్యాపించడంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి.

తగ్గిన చిరుధాన్యాల సాగు...

రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగు తగ్గింది. జొన్న, సజ్జ, రాగి, కొర్ర, వరిగెలు, పెసర, మినుము తదితర పంటల సాగు పూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఈ ఏడాది ఈ ఆహార ధాన్యాల ధరలు పెరగనున్నాయి. ఇటీవల కాలంలో జొన్న, రాగి, కొర్ర ఆహార ధాన్యాలుగా ప్రజలు ఎక్కువగా తీసుకుంటున్నారు. జిల్లాలో వీటి విస్తీర్ణం తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి.

పంట	సాగు కావాల్సింది (హెక్టార్లలో)	సాగైంది (హెక్టార్లలో)
వరి	21,669	13,156.82
జొన్న	4294	2325.28
సజ్జ	262	105.00
మొక్కజొన్న	4960	5704.50
రాగి	295	95.05
కొర్ర	62	2.61
అరికలు	1	0
వరిగెలు	1207	495.72
పప్పుశనగ	49177	23962.73
కంది	786	628.81
పెసర	647	147.49
మినుము	25,607	11,847.99
ఉలవలు	538	713.18
అలసందలు	7565	7107.87
వేరుశనగ	500	357.73
నువ్వులు	2258	556.65
పొద్దుతిరుగుడు	628	35
ఆముదం, నైజర్	629	87.77
ఇతర రకాల పంటలు		
పత్తి	1182	30.21
పొగాకు	27,298	41,825.78
మిర్చి	6,787	4,242.72
కొత్తిమీర	211	16.890
చెరకు	36	41.500
డ్రైఫ్రూట్స్	190	152.280
ఉల్లి	5	6
టమోట	345	95.270
ఇతర కూరగాయలు	759	477.265
ఇతర పంటలు (పూలు తదితర)	3097	2697.771



జెడ్పీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన మంత్రులు డోలా, గొట్టిపాటి, జేసీ

రోడ్ల పనులు అధ్వానం

● రోడ్లకు ప్యాచ్ వర్కులు సరిగా చేయక పోవటంతో ప్రజల అవస్థలు
● అధికారులను నిలదీసిన ఎమ్మెల్యేలు
● ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తిన ఎమ్మెల్యే తాటిపర్తి
● అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని ఎమ్మెల్సీ తూమాటి ధ్వజం
● రెవెన్యూ అధికారుల తీరుపై గళమెత్తిన బూచేపల్లి
● 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.98,26,170 మిగులుతో అంచనా బడ్జెట్ ఆమోదం



మంత్రి స్వామి, జేసీ గోపాల కృష్ణతో దర్శి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం ఇచ్చి చర్చిస్తున్న దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లకు మరమ్మతులు చేయకపోవటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల వేసిన ప్యాచ్ వర్కులు కూడా సక్రమంగా చేపట్టలేదు. ప్యాచ్ వర్కులు నాణ్యతగా చేయకపోవటంతో కంకరు, తారు అప్పుడే లేచిపోతోంది. కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా ప్యాచ్ వర్కులు చేస్తున్నారని ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. ఆర్‌అండ్‌బీ విభాగం అధికారులు సమీక్ష చేస్తున్నప్పుడు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు రోడ్ల సమస్యను లేవనెత్తారు. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సభ్యులతో పాటు అధికార టీడీపీ ఎమ్మెల్యేలు కూడా నాణ్యతలేని రోడ్ల మరమ్మతులపై అసహనం వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్ రోడ్డులో ఉన్న పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌పై కూడా చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు విభాగాల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసహనం వ్యక్తం చేశారు. రోడ్ల మరమ్మత్తుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నూతన విద్యా విధానం వల్ల పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సమీక్షలో విద్య, ఆర్‌అండ్‌బీ, సాంఘిక సంక్షేమ శాఖ, ఎలక్ట్రిసిటీకి సంబంధించిన సమస్యలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, అదనపు తరగతి గదులు లేవని, టాయిలెట్స్ కూడా సక్రమంగా లేవన్నారు. దర్శి నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు ఆర్‌ఐలు, ఎఫ్‌ఐలు రేషన్ షాపుల్లో కూర్చొని బయట నుంచి బియ్యం తెప్పించి అప్పటి వరకు చేస్తున్న రేషన్ షాపు డీలర్లపై 6 ఏ కేసులు నమోదు చేశారన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు తమవద్ద ఉన్నాయన్నారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దర్శి నియోజకవర్గంలోని పలు సమస్యలపై, రెవెన్యూ అధికారులు చేసిన దుర్మార్గాలపై జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్ల పనులు చేపట్టినా డబ్బులు ఉండి కూడా అధికారులు బిల్లులు ఇవ్వటం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నాయని, ఇతర పథకాల్లో రూ.50 లక్షలు ఉన్నా బిల్లులు ఇవ్వకుండా అధికారులు సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్యాచ్ వర్కులు ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. కొత్తపట్నం రోడ్డులో ప్యాచ్ వర్కులు చేశారని, అవి నాణ్యతగా లేకపోవటంతో అప్పుడే లేచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర బైపాస్‌లో కిమ్స్ వైద్యశాల సమీపంలో సర్వీసు రోడ్డు పెద్దపెద్ద గుంతలమయంగా మారిందన్నారు. సమావేశాలకు నేషనల్ హైవే అధికారులను కూడా పిలిపించండని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడతూ టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా అభివృద్ధి పనులు వేగంగా జరగటం లేదన్నారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో మర్రిపూడి రోడ్డు బాగలేదన్నారు. రోడ్డు బాగలేకపోవటంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, నియోజకవర్గంలో విద్యుత్ తీగలు బాగా కిందకు వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయని, స్తంభాలు మార్చి లైన్లు త్వరగా వేయకపోతే ప్రమాదాలు జరిగే ప్రమాదముందని చెప్పారు.

రూ.98,26,170 మిగులు బడ్జెట్‌తో ఆమోదం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్‌ను సమావేశం ఆమోదం తెలిపింది. అందుకుగాను రూ.768,33,59,019 ఆదాయం రాగా రూ.767,35,32,849 ఖర్చుల కింద చూపించారు. సమావేశం రానున్న ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను పూర్తి మెజారిటీతో ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి కుమార్ జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఫలాలు అందరికీ సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, బీఎన్ విజయ కుమార్, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్ర శేఖర రెడ్డి, జాయింట్ కలెక్టర్లు రోణంకి గోపాల కృష్ణ, ప్రకార్ జైన్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవితో పాటు జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించరా..

వైఎస్సార్ సీపీకి చెందిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని ధ్వజమెత్తారు. యర్రగొండపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యశాల కమిటీకి చైర్మన్‌ను అయిన తనను కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కనీసం ఆహ్వానించలేదన్నారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రి, కలెక్టర్ పక్కపక్కన కూర్చొని మరీ స్థానిక ఎమ్మెల్యేను ఎందుకు పిలవలేదని కూడా అధికారులను అడగలేదంటే ఇక అధికారులు ఏవిధంగా ప్రొటోకాల్ పాటిస్తారని రాష్ట్ర మంత్రులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి కుమార్‌ను అడిగారు. మాకు దక్కాల్సిన హక్కులను అడుగుతున్నామన్నారు. లేకుంటే ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ ఇవ్వము అని చెప్పండని తాటిపర్తి నిలదీశారు. నియోజకవర్గంలో అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించినా పిలుపులేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇంతలోనే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కల్పించుకొని ఎమ్మెల్సీ అయిన తనకు కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు పిలవటంలేదని ధ్వజమెత్తారు. కావాలని అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదన్నారు. వెంటనే చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు కూడా ప్రొటోకాల్ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. సాక్షాత్తు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను చీమకుర్తి మండలంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదన్నారు. ఈ విధంగా అధికారులు చేయటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి, ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రొటోకాల్ మరచి పచ్చనేతల సేవలో..

● అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించని ఎంపీడీఓలు
● ప్రజలు వ్యతిరేకించిన టీడీపీ నాయకుడితోనే కార్యకలాపాలు
● దోర్నాలలో జరిగిన ప్రజా దర్బార్‌కు ఎమ్మెల్యే తాటిపర్తికి అందని ఆహ్వానం
● ఎమ్మెల్యే హాజరవుతారని వైపాలెం మండల పరిషత్ సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులు
● ఎంపీడీవోల పనితీరుపై ఆగ్రహిస్తున్న ప్రజా ప్రతినిధులు

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో ఉన్న ఎంపీడీవోల పనితీరుపై ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులకు వారు ఎటువంటి గౌరవం ఇవ్వడంలేదు. ఎన్నికల సమయంలో ప్రజలు వ్యతిరేకించిన టీడీపీ నాయకుడికి పెద్ద పీట వేస్తూ ఆయన చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్న తీరుపట్ల నియోజకవర్గ ప్రజలు ఇదేమి బోధ్యమంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

■ గత నెల 10వ తేదీ యర్రగొండపాలెం మండల పరిషత్ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఎమ్మెల్యేతో సహా అన్ని శాఖలకు చెందిన అధికారులను ఆహ్వానిస్తూ సర్క్యులర్ పంపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించేందుకు పాల్గొంటారన్న విషయం తెలుసుకున్న ఎంపీడీవో ఏకంగా ఆ సమావేశానికి హాజరు కాకపోగా, అధికారులను సైతం డుమ్మా కొట్టించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు తీవ్ర నిరసన వ్యక్తపరచి సమావేశాన్ని బహిష్కరించారు.

■ తాజాగా పెద్దదోర్నాలలో శనివారం జరిగిన ప్రజా దర్బార్‌కు ఆ మండల ఎంపీడీవో నాసర్‌రెడ్డి ఎమ్మెల్యేతోపాటు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించలేదు. కూటమి నాయకుడి చలువ ఉంటే చాలనుకున్నాడేమో.. ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుకు పెద్దపీటవేసి ఆయన మెప్పు పొందారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎటువంటి హోదాలేని వారితో ప్రజా దర్బార్ నిర్వహించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రజలు చెప్పుకునే సమస్యలను కూటమి నాయకుడు పరిష్కరించేలా దర్జాగా దర్బార్‌ను ఎంపీడీవో జరపడం ఆ మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రజా దర్బార్ జరుగుతున్నట్లు ముందుగా సమాచారం తెలిపే సర్క్యులర్‌ను నామమాత్రంగా తనకు నచ్చిన నాయకులకు పంపి ఎంపీడీవో పచ్చభక్తిని చాటుకున్నారు. ఈ సర్క్యులర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల పేర్లతోపాటు ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరు కూడా లేకపోవడం గమనార్హం. ఎంపీడీవో తీరును పలువురు టీడీపీ నాయకులు తప్పుపడుతున్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎంపీపీ గుమ్మా పద్మజ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్యతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీడీవో తీరుపై జిల్లా ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

● రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న 50 టీలు
● అండర్ 45 ఇయర్స్ విభాగంలో గుంటూరు టీం విన్నర్, కనిగిరి టీం రన్నర్స్
● 45 ప్లస్ టీం విభాగంలో గిద్దలూరు టీం విన్నర్, నరసరావుపేట టీం రన్నర్

కనిగిరిరూరల్: దివంగత పులి వెంకట రమణారెడ్డి జ్ఞాపకార్థం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న లాన్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి క్రీడలు ఆదివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు సుమారు 50 టీంలు పోటీలో పాల్గొనగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో హోరాహోరీగా పోటీలు సాగాయి. తొలుత ఈ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్, క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ గఫార్, సీఐ ఖాజావలి, లాన్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

రాష్ట్ర స్థాయి పోటీల విజేతలు వీరే..

■ అండర్ 45 ఇయర్స్ విభాగంలో రాముఅండ్ సూర్య టీం (గుంటూరు) విన్నర్స్‌గా నిలవగా, ఫిరోజ్ అండ్ రఫీ టీం(కనిగిరి) రన్నర్స్‌గా నిలిచారు.

■ 45 ఇయర్స్ ప్లస్ విభాగంలో మురళి అండ్ రంగయ్య టీం (గిద్దలూరు) రన్నర్స్ కాగా, కోటిరెడ్డి అండ్ రాము నర్సారావు టీం (నరసరావుపేట) రన్నర్స్‌గా నిలిచారు.

■ 55 ఇయర్స్ ప్లస్ విభాగంలో డాక్టర్ శంకర్‌రెడ్డి అండ్ సుధార్ రెడ్డి టీం (ప్రొద్దుటూరు) విన్నర్స్‌గా నిలవగా, డీఎస్పీ శ్రీనివాసరావు అండ్ రమణారెడ్డి టీం ఒంగోలు రన్నర్స్‌గా నిలిచారు.

■ 65 ఇయర్స్ ప్లస్ విభాగంలో గుంటూరు మధుకర్ అండ్ విజయ్‌కుమార్ టీం విజేతలు కాగా, మనోహర్ అండ్ రత్తయ్యటీం (కనిగిరి) రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహక కమిటీ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



ఫ్లడ్ లైట్ల వెలుగులో సాగుతున్న లాన్ టెన్నిస్ క్రీడలు

క్లుప్తంగా

సాగర్ కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై శ్రీనివాసరెడ్డి

దర్శి: సాగర్ కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే...దర్శికి చెందిన మలసాని శ్రీనివాసరావు(52) కొంత కాలంగా కిడ్నీల వా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో డయాలసిస్ చేయించుకుంటూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మోటార్ సైకిల్‌పై ఎన్ఎస్పీ కాలువ లాకుల వద్దకు వచ్చి కొంత సేపు కాలువ గట్టుపై కూర్చొని తర్వాత కాలువలో దూకినట్లు తెలిసింది. ఇంటి వద్ద కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు కోసం వెతకగా కనిపించలేదు. మోటార్ సైకిల్ ఎన్ఎస్పీ కాలువ దగ్గర ఉందని తెలుసుకొని కాలువలో వెతగ్గా శ్రీనివాసరావు మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆనంద్ మృతిపై పోలీసుల విచారణ


సగిలేరు వాగు వద్ద ఆనంద్ బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కేఎస్‌పల్లె గ్రామానికి చెందిన గడ్డం ఆనంద్(19) అనే యువకుడు మృతిపై పోలీసులు ఆదివారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే..గత ఏడాది అక్టోబర్ 28వ తేదీన కేఎస్‌పల్లె సమీపంలో ఉన్న భీమలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోని సగిలేరు వాగులో మృతి చెందాడు. ఆ సమయంలో ఆనంద్ మృతిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం రిపోర్టులో ఆనంద్ ఈతకు వెళ్లి నీళ్లు తాగి మృతి చెందినట్లు నివేదిక ఇచ్చారు. అయితే పోలీసులు కేసును తారుమారు చేశారని, పోస్టుమార్టం నివేదిక తప్పని ఆనంద్ బంధువులు ఇటీవల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. అనంతరం నంద్యాల హైవే రోడ్డులో రాస్తారోకో చేశారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఆనంద్ మృతిపై మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందంతో పునఃవిచారణ చేపట్టారు. ఆనంద్‌ను స్నేహితులు హత్య చేసి నీటి కుంటలో పడేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆనంద్ మృతి కేసును పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం మృతుని బంధువులతో మాట్లాడారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): విద్యుదాఘాతానికి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని కంకణంపాడులో జరిగింది. వివరాల్లోకి వెళితే..కంకణంపాడుకు చెందిన రైతు కారుమంచి పెదబాదుర్లా(75) తన పొలంలో కంది, పశువుల మేత గడ్డిని సాగు చేస్తున్నాడు. పక్క పొలానికి చెందిన రైతు పొగాకు సాగు చేస్తూ గత కొద్ది రోజుల నుంచి బాదుర్లా పొలం మీదుగా విద్యుత్ లైన్ వైరును లాక్కున్నాడు. ఈ క్రమంలో పక్క పొలానికి లాగిన విద్యుత్ వైరు నేలపై కిందకు పడింది. ఆ సమయంలో పెద బాదుర్లా తన పొలానికి నీళ్లు పట్టేందుకు వెళ్తుండగా నేలపై ఉన్న విద్యుత్‌కు విద్యుత్ ప్రసరించి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై


పాఠశాల వజ్రోత్సవాల కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు


నృత్య ప్రదర్శన చేస్తున్న పాఠశాల విద్యార్థులు

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం

- ఘనంగా మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాల వజ్రోత్సవం, స్వర్ణోత్సవం
- 35 బ్యాచ్‌లకు చెందిన 3,800 మంది పూర్వ విద్యార్థుల హాజరు

మద్దిపాడు: మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం, జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా సాగాయి. ఈ వేడుకలకు 35 బ్యాచ్‌లకు చెందిన దాదాపు 3,800 మంది విద్యార్థులు హాజరు కావడంతో పాఠశాల ఆవరణ మొత్తం కోలాహలం నెలకొంది. ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో ఉన్న ఎంతో మంది వేడుకలకు హాజరై పాఠశాల, కళాశాలతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఏళ్ల నాటి పాత మధురాలను నెమరు వేసుకుంటూ చిన్నపిల్లలు అయిపోయారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి పనులు గుర్తు చేసుకుంటూ పరవశించిపోయారు. ఈ వేడుకల్లో ఐఏఎస్‌లు, వైద్యులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎందరో తమ హోదాలను పక్కనపెట్టి అందరితో కలివిడిగా మనసు విప్పి మాట్లాడుకొని తనివితీరా నవ్వుకున్నారు. ఈ మట్టిలో ఏ అదృష్టం ఉందో, మేం ఇక్కడ చదివి ఉన్నత స్థానాలకు చేర్చిందని సభలో కొనియాడారు. గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను చీమకుర్తి మండలం రాజానగరం నుంచి వచ్చి మద్దిపాడు హాస్టల్లో చేరి ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగానని అన్నారు. అటువంటి పాఠశాలకు వజ్రోత్సవ వేడుకలు, కళాశాలకు స్వర్ణోత్సవ వేడుకలు జరగడం, ఆ కార్యక్రమానికి తాను హాజరవ్వడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ బందెల అంజయ్య మాట్లాడుతూ ఇక్కడ పాఠశాల కళాశాలలో చదవడం నిజంగా ఎంతో అదృష్టమన్నారు. కళాశాల అధ్యాపకులు ప్రతి విద్యార్థి పూర్తిగా చదువుల వైపు దృష్టి కేంద్రీకరించేలా చర్యలు తీసుకొని విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేశారని కొనియాడారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మాట్లాడుతూ ఇటువంటి సంబరాలు చూసినప్పుడు ప్రతి ఒక్కరూ తమ బాల్యస్మృతులను గుర్తుకు తెచ్చుకుంటారన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కడియాల యాదయ్య జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల జూబ్లీ ఉత్సవాల వేడుకలకు పలువురు పూర్వ విద్యార్థుల హాజరయ్యారని, మీరంతా కలిసి పాఠశాల ఉన్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ముందుగా పూర్వ విద్యార్థులు పలువురు పాఠశాలలో తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు ప్రతి అరగంటకు సాంస్కృతిక నృత్యాలు, జానపద గేయాలకు స్టెప్పులేస్తూ ఆహుతులను అలరించారు. పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదివి ఈ పాఠశాలకు ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా 28 ఏళ్ల పాటు పనిచేశానన్నారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేసి మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా వీడ్కోలు చెప్పుకున్నారు.


వేడుకల్లో మాట్లాడుతున్న పాఠశాల పూర్వ విద్యార్థి, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాస్

నేటి నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్

- జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు
- 14,538 మంది విద్యార్థులు
- రెండు విడతల్లో విద్యార్థులకు ప్రాక్టికల్స్
- ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్ వెల్లడి


సైమన్ విక్టర్

మార్కాపురం: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు విడతలుగా ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి 14 వరకు మొదటి విడత, 15 నుంచి 19 వరకు రెండవ విడతలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి ప్రాక్టికల్ పరీక్షలకు 14,538 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ప్రైవేట్ పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకుడిని నియమించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. మొదటి విడతలో 64 కళాశాలల్లో, రెండవ విడతలో 28 కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటుచేస్తున్నామన్నారు. మారుమూల గ్రామాల్లో ఉండే సెంటర్లకు విద్యార్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని చెప్పారు.

కరాటే ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ప్రకాశం


ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న ప్రకాశం జిల్లా విద్యార్థుల

ఒంగోలు: కరాటే ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ప్రకాశం జిల్లా కైవసం చేసుకుంది. స్థానిక రంగా భవన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ అంతర్ జిల్లాల 3వ షటోకాన్ కరాటే, ఒకటవ సిలంభం, నాన్‌ఛాక్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలకు ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి మొత్తం 220 మంది హాజరుకాగా ప్రకాశం జిల్లా విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. కృష్ణా ద్వితీయ స్థానంలో నిలవగా, గుంటూరు తృతీయస్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు టి.శ్రీనివాసరెడ్డి, జయశ్రీలు ప్రకటించారు. పోటీల పర్యవేక్షణకు అంతర్జాతీయ సిలంబం ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సంతోష్‌కుమార్ హాజరయ్యారు.

పోటీలకు చీఫ్ జడ్జిగా షోటోకాన్ కరాటే 6వ డాన్ కె.రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కరాటేతో ఆత్మస్థైర్యంతోపాటు ఏకాగ్రతను పెంపొందించుకోవడం సాధ్యపడుతుందన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, మెడల్స్ బహూకరించారు.

5కే జోష్

- క్యాన్సర్, మత్తు పదార్థాలపై అవగాహన అవసరం: కలెక్టర్
- మాదక ద్రవ్యాలకు బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దు: ఎస్పీ


5కే రన్‌లో పాల్గొన్న యువత

ఒంగోలు సబర్బన్: క్యాన్సర్, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన అవసరమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. క్యాన్సర్, మత్తు పదార్థాల నియంత్రణపై రైజ్ కృష్ణ సాయి ఇంజినీరింగ్ కళాశాల, టెక్‌బుల్ సంయుక్తంగా నగరంలో ఆదివారం 5కేస్-2025 మారథాన్ నిర్వహించారు. ఈ రన్ నగరంలో ఉత్సాహంగా సాగింది. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాలకు బానిసలై కొంత మంది యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, క్షణ కాలం సంతోషం కోసం నూరేళ్ల జీవితంలోని వెలుగును దూరం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు తల్లితండ్రుల కష్టాలు గుర్తుపెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందస్తు అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని బారిన పడకుండా ఉండవచ్చన్నారు. తొలుత ఒంగోలు మినీ స్టేడియం నుంచి 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ 5కే రన్‌లో యువత, ప్రజలు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ పరుగు మినీ స్టేడియం నుండి ప్రారంభమై మిరియాల పాలెం వద్ద యూ టర్న్ తీసుకొని తిరిగి మినీ స్టేడియం వద్ద ముగిసింది. విజేతలుగా నిలిచిన మహిళల విభాగంలో ఒకరికి, పురుషుల విభాగంలో ఒకరికి మొదటి బహుమతి కింద ఇద్దరికి రూ.20,000 చొప్పున, రెండవ బహుమతి రూ.15,000 చొప్పున, తృతీయ బహుమతి కింద రూ.10,000 చొప్పున, కన్సోలేషన్ బహుమతి కింద పది మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున అందజేశారు. నగదు బహుమతితో పాటు మెమెంటోలు, జ్ఞాపికలు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి యన్ విజయకుమార్‌లు అందజేశారు. కార్యక్రమంలో రైజ్ కాలేజి భరత్, టెక్ బెల్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, రైజ్ సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ శిద్దా హనుమంతరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్, తాలూకా సీఐ అజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఆర్ఐ రమణారెడి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ముగిసిన క్విస్ ఫెస్ట్


మాట్లాడుతున్న డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: ఒంగోలు క్విస్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్విస్ ఫెస్ట్-2025 ఆదివారం ఉత్సాహంగా ముగిసిందని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సస్టైనబులిటీ కాన్సెప్ట్‌తో రివైవ్, రీయూజ్, రీసైకిల్ థీమ్‌తో ఈ ఏడాది క్విస్ ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలకు దేశ నలుమూలల నుంచి విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మూడు వేల మందికి పైగా విద్యార్థులు సాంకేతిక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోర్ట్స్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. వికసిత భారతాన్ని నిర్మించాలనే ప్రధాని లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తూ ఈ థీమ్స్ తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఐటీ రాయ్‌పూర్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు పాల్గొని మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న ప్రాజెక్టులు, టీచింగ్ విధానం అద్భుతంగా ఉందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

క్విస్ ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సుమారు 173 కాలేజీలకు సంబంధించిన వారు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో, క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ సుబ్బారావు, కన్వీనర్ సమీర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు


మొదటి బహుమతి సాధించిన పొదిలి జట్టు

పొదిలి రూరల్: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు స్థానిక విశ్వనాథపురంలోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకుడు నాగేశ్వరరావు తెలిపారు. పోటీలు మెన్స్ డబుల్స్, 50ఏళ్ల పైబడి డబుల్స్ విభాగాల్లో నిర్వహించారు. పోటీలు చివరి వరకు ఎంతో ఉత్సాహంగా సాగాయి. మెన్స్ డబుల్స్ విభాగంలో చీమకుర్తికి చెందిన వి.ప్రణయ్, సందీప్‌లు మొదటి బహుమతి గెలిచి రూ.10 వేలు సాధించారు. పొదిలికి చెందిన రెహమాన్, రమేష్‌లు రెండో బహుమతి రూ.7 వేలు, ఒంగోలుకు చెందిన రాహుల్, కిట్టు మూడవ బహుమతి రూ.5 వేలు, పొదిలికి చెందిన రాము, వెంకటరావు నాల్గవ బహుమతి రూ.3 వేలను దక్కించుకున్నారు. 50 ఏళ్లు పైడిన విభాగంలో డబుల్స్‌లో పొదిలికి చెందిన ఎం నాగేశ్వరరావు, అజీల్ మొదటి బహుమతి రూ.6 వేలు, దర్శికి చెందిన పోలేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి రెండో బహుమతి రూ.4 వేలు గెలుచుకున్నారు. పామూరుకు చెందిన డాక్టర్ రవి, వి.శ్రీనివాసులు మూడవ బహుమతి రూ.3 వేలు కైవసం చేసుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

జూనియర్ లైన్‌మెన్‌పై టీడీపీ వర్గీయుల దాడి

- తీవ్రంగా కొట్టి బైకు ధ్వంసం


దాడిలో గాయపడిన కోటిరెడ్డి


కోటిరెడ్డి వెహికల్ ధ్వంసం

సంతనూతలపాడు: విద్యుత్ మీటర్ రీడింగ్ తీసుకునేందుకు వచ్చిన జూనియర్ లైన్‌మెన్‌పై టీడీపీ వర్గానికి చెందిన వ్యక్తులు దాడిచేసి గాయపరిచి, అతని బైక్‌ను కూడా ధ్వంసం చేసిన ఘటన మండలంలోని గురువారెడ్డిపాలెంలో ఆదివారం జరిగింది. మండలంలోని గురువారెడ్డిపాలెం గ్రామ విద్యుత్ శాఖ గ్రామ గ్రేడ్ 2 జూనియర్ లైన్‌మెన్ సీహెచ్ కోటిరెడ్డి గ్రామంలో విద్యుత్ రీడింగ్ తీస్తుండగా గ్రామానికి చెందిన రాయపూడి వెంకటనారాయణ, చింతం అజయ్ కుమార్ రెడ్డి తదితరులు దాడి చేసినట్లు బాధితుడు కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తుండగా తనపై దాడిచేసి గాయపరిచి తన మోటారు సైకిల్‌ను కూడా ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గతంలో తనిఖీలు చేసినప్పుడు విద్యుత్ బకాయిలు ఉండటంతో స్క్వాడ్ సిబ్బంది ఆదేశాల మేరకు విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు తెలిపాడు. ఆ కోపంతోనే తనపై దాడిచేశారన్నారు. జూనియర్ లైన్‌మెన్ కోటిరెడ్డిపై దాడిపై విద్యుత్ ఏఈ టీ సంతోష్, జూనియర్ సబ్ ఇంజనీర్ బీ కృష్ణ, ఆందోళన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు


టంగుటూరు: మద్యం మత్తులో కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.మేదరమెట్లకు చెందిన బాలకోటేశ్వరరావు, జమ్మలమడుగు గ్రామానికి చెందిన విజయ్ ఇద్దరూ పచ్చాకు పని నిమిత్తం టంగుటూరు వైపు వెళుతుండగా ఇన్నోవా కారు డ్రైవర్ మద్యం మత్తులో వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో బాలకోటేశ్వరరావు తలకు, విజయ్ కాళ్లు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఎస్పీ ప్రమాదాన్ని గమనించి జాతీయ రహదారి అంబులెన్స్ 1033 కాల్ చేసి వెంటనే తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన కారు నడిపిన వ్యక్తిని తనిఖీ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

- ఎస్పీ ఏఆర్ దామోదర్

సింగరాయకొండ:

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీస్‌స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఎస్పీ దామోదర్ సింగరాయకొండ, జరుగుమల్లి పోలీస్‌స్టేషన్లను ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రెండు పోలీస్‌స్టేషన్లలో కార్యాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందితో స్వయంగా మాట్లాడి వారికి తగిన సూచనలు చేశారు. తరువాత విలేకరులతో మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వారి సమస్యను సామరస్యంగా అడిగి తెలుసుకుని వారికి పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. ప్రతి కానిస్టేబుల్ ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, జరుగుమల్లి ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సైలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.


జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్